బీచ్ రోడ్డులో భూమాయ



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో మాయమైన హెచ్చరిక బోర్డు

- ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువు
- మాయమైపోతున్న హెచ్చరిక బోర్డులు
- తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్లు
- అందుబాటులో లేని రెవెన్యూ అధికారులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువవుతోంది. విశాఖ–భీమిలి రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలం దొరకాలన్నా, కొనాలన్నా ప్రస్తుతం సాధ్యం కాని పని. సెంటు స్థలం లక్షల్లో పలుకుతుంది. పోనీ ఏదో విధంగా కొందామన్నా ఈ ప్రాంతాల్లో స్థలం దొరకని పరిస్థితి. అందుకే ప్రభుత్వ స్థలాలపై బడా బాబుల కన్ను పడింది. చోటా, బేటా నాయకులను పట్టుకుని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు పలువురు పావులు కదుపుతున్నారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ఈ ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

సర్వే నంబర్ మార్చి రిజిస్ట్రేషన్



సర్వే నంబర్ మార్చి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రభుత్వ స్థలం

మంగమారిపేట దరి నర్సింహనగర్‌లో ఏకంగా ప్రభుత్వ స్థలానికి సర్వే నంబర్ మార్చి రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి 314 సర్వే నంబర్‌లో ఉన్న భూమిని 302 సర్వే నంబర్ వేసి దర్జాగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. లక్షల విలువ చేసే ఈ భూమి తమదంటూ, రోడ్డు విస్తరణలో తమ స్థలం పోతే, తామే సొంతంగా ఈ స్థలాన్ని ఆక్రమించుకున్నామని దర్జాగా చెబుతున్నారు ఇక్కడున్న ఓ వ్యక్తి. నిజంగా రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోతే ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుంది. లేక టీడీఆర్.. అదీ కాకపోతే వేరే చోట స్థలం కేటాయిస్తుంది. ఇవేమీ కాకుండా తమకు నచ్చినట్లు తామే ప్రభుత్వ స్థలం ఆక్రమించుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా ఓ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారే కానీ, తప్పుడు సర్వే నంబర్ వేసి ప్రభుత్వ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కొండంతా నాదే..

బీచ్ రోడ్డు తిమ్మాపురంలో సొసైటీ పేరుతో ఓ వ్యక్తి కొండను ఏకంగా దత్తత తీసుకున్నాడు. ఇక్కడ ఎన్ని అనధికారిక నిర్మాణాలు జరిగినా, కొండను తవ్వి గ్రావెల్ తరలించినా, ప్లాట్లుగా వేసి ప్రభుత్వ స్థలం అమ్మేసినా ఒక్క రెవెన్యూ అధికారి కానీ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి కానీ కన్నెత్తి చూడరు. కొండను సైతం తన ఆధీనంలోకి తీసుకున్న సదరు వ్యక్తిపై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో పై వాడికే తెలియాలి. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా వేసి అమ్మేస్తున్నా అధికారుల చర్యలు మాత్రం శూన్యం. దీనిపై ఫిర్యాదులు అందినా ఇక్కడ ఓ హెచరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు.

బోర్డు పెట్టినా.. తొలగించి..



సోమన్నపాలెంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెం నూకాలమ్మ గుడి వెనుక ఓ వ్యక్తి 50 సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమించుకున్నాడు. 2011 సంవత్సరంలో అప్పటి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అక్కడ బోర్డు మాయం చేసి మరలా ఆ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు చుట్టూ కంచె వేసుకున్నాడు. అధికారులు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి కంచెను తీసేశారే తప్ప, గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తీసినందుకు చర్యలు తీసుకోలేదు. అంతేకాదు ప్రస్తుతం నామమాత్రంగా చర్యలు తీసుకున్నారే తప్ప హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు.

- కాపులదిబ్బడపాలెంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రాత్రి సమయాల్లో కొండను తవ్వి ప్లాట్లుగా విభజించి స్థానిక గ్రామ పెద్దలు ప్రభుత్వ స్థలాన్ని రూ. 10 నుండి 15 లక్షలకు అమ్మేస్తున్నారు. ఇదంతా కింది స్థాయి రెవెన్యూ సిబ్బందికి తెలిసినా పట్టించుకోరు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సర్వే చేసి కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మంగమారిపేటలో హెచ్చరిక బోర్డు మాయం

విశాఖ–భీమిలి బీచ్ రోడ్డు మార్గ మధ్యలో సాగరానికి అభిముఖంగా విలువైన ప్రభుత్వ స్థలం ఒకటి ఉంది. రామాద్రి సమీపంలో 314 సర్వే నంబర్‌లో గల 73 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు స్థానిక నాయకులు గతంలో ప్రయత్నించారు. దీనిపై పలువురు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే, కోట్లు విలువ చేసే ఈ ప్రభుత్వ స్థలంలో అకస్మాత్తుగా హెచ్చరిక బోర్డు మాయమైంది. ఇంకేముంది ఈ స్థలాన్ని అమ్మేందుకు బేరాలు కూడా సాగుతున్నాయి. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా హెచ్చరిక బోర్డులు మాయమైనా తామేమి చేయలేమని, ప్రస్తుతం తమ దగ్గర హెచ్చరిక బోర్డులు లేవని సెలవిచ్చారు.

ఒక్క అడుగు ఆక్రమించినా ఉపేక్షించం

ప్రభుత్వ స్థలాన్ని ఒక్క అడుగు ఆక్రమించినా ఉపేక్షించం. ఇప్పటికే కలెక్టర్ హరేందిర ప్రసాద్ ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బీచ్ రోడ్డులో జరుగుతున్న ఆక్రమణలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారు ఎంతటి వారైనా సరే క్షమించేది లేదు.

– సంగీత్ మాథూర్, ఆర్డీవో

మజ్జిగ పంపిణీ



పద్మనాభం జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న అయ్యప్ప స్వామి భక్తులు

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో అయ్యప్ప స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పద్మనాభం జంక్షన్‌లో శుక్రవారం స్వామి భక్తులు మజ్జిగ, లస్సీ పంపిణీ చేశారు. జంక్షన్‌లో ఉన్న ప్రయాణికులకు వీటిని సరఫరా చేశారు. ముందుగా భక్తులు స్వామి చిత్ర పటం వద్ద పూజలు చేశారు.

ధర్మశాస్త్ర అయ్యప్ప పీఠంలో..

మద్దిలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి పీఠంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సామవేదం బదిరికా వాసు భక్తులతో ఈ అభిషేకాలు చేయించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అభిషేకాల్లో పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై వాటర్ పైపులు

తగరపువలస: రైతులకు రాయితీపై పీవీసీ పైపులు, క్విక్ యాక్షన్ కప్లర్‌తో కలిసి హెచ్‌డీపీఈ వాటర్ క్యారియింగ్ పైపులు అందుబాటులో ఉంచినట్లు భీమిలి వ్యవసాయాధికారి బి.శివకోమలి తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీ , నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ అండ్ ఆయిల్ సీడ్స్ పథకంలో భాగంగా వీటిని అందిస్తున్నామన్నారు. పీవీసీ పైపులపై మీటర్‌కు రూ.35, హెచ్‌డీపీఈ పైపులకు రాయితీ రూ.50 పోను అందిస్తున్నట్లు చెప్పారు. రాయితీ మినహాయించిన తరువాత పీవీసీ రెండు అంగుళాల పైపు మీటర్‌కు రూ.56, 2.5 అంగుళాల పైపులు రూ.98, మూడు అంగుళాల పైపులు రూ.126, నాలుగు అంగుళాల పైపులు రూ.192 వంతున రైతులు తీసుకోవచ్చని తెలియజేశారు. అలాగే ఆరు మీటర్లు పొడవు హెచ్‌డీపీఈ వాటర్ క్యారియింగ్ పైపులు రెండు అంగుళాల ధర రూ.294, 2.5 అంగుళాలు రూ.375, మూడు అంగుళాలు రూ.537, నాలుగు అంగుళాలు రూ.1112 ఉన్నాయన్నారు. ఆసక్తి గల భూమి ఉన్న రైతులు పట్టా పాస్ పుస్తకం , ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలతో రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

శ్రీవారికి అన్నకూటోత్సవం



అన్నం, బూరెలతో ఏర్పాటు చేసిన శ్రీవారి ఆకృతి

భీమునిపట్నం: భీమిలిలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నకూటోత్సవం నిర్వహించారు. 20 కిలోల అన్నం, 108 బూరెలను శ్రీవారి ఆకృతిలో అలంకరించి, స్వామికి నివేదించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల ఇండస్ట్రియల్ ఫీడర్‌లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గిడిజాల, ముచ్చర్ల, బాకూరుపాలెం గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉమాదేవికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న ఉమాదేవి అమ్మవారు

పీఎం పాలెం: ఫాల్గుణ పూర్ణిమను పురస్కరించుకుని పీఎం పాలెం ఆఖరు బస్టాపు దరి శ్రీ శృంగేరీ శంకరమఠంలోని ఉమా సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి, సరస్వతీ మాతకు విశేష అర్చనలు చేశారు. హారతి అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

అనకాపల్లి నూకాంబికా దేవస్థానం ఈవోగా వెంపలి

మహారాణిపేట: అనకాపల్లిలోని శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సింహాచలం దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న వెంపలి రాంబాబు నియమితులయ్యారు. శ్రీ కనక మహాలక్ష్మి ఆలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రాంబాబును ఇటీవల సింహాచలం దేవస్థానం అసిస్టెంట్ కార్యనిర్వహణాధికారి (ఏఈవో)గా బదిలీ చేశారు. ఆయనకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో అనకాపల్లి దేవస్థానానికి సహాయ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా నియమించారు. ప్రస్తుతం నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం ఇన్చార్జి ఈవోగా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఎస్.సుజాత పని చేస్తున్నారు. శనివారం వెంపలి రాంబాబు ఈవోగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

ఎంవీపీ రైతుబజార్ తనిఖీ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత పరిశీలించారు. ఉత్తరాంధ్ర పర్యటన నేపథ్యంలో విశాఖకు వచ్చిన ఆమె శుక్రవారం సాయంత్రం ఎంవీపీ రైతు బజార్‌ను తనిఖీ చేశారు. ఇటు రైతులకు, అటు వినియోగదారులు ఇబ్బందులు లేకుండా ధరలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పలువురు రైతులతో ముచ్చటించారు. రైతుల కార్డులు, డ్వాక్రా కౌంటర్లను పరిశీలించారు. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందులో రైతులను భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి రూ.6.65 లక్షలతో మరమ్మతులు



మరమ్మతుల అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం తూడెం అంగన్‌వాడీ భవనానికి రూ.6.65 లక్షలతో మరమ్మతులు చేయించింది. వంటగది, కప్‌బోర్డు, టైల్స్, శ్లాబ్‌కు మరమ్మతులు, థీమ్ పెయింట్స్ చేయించింది. మరమ్మతుల అనంతరం భవనాన్ని సర్పంచ్ గాలి నరసయ్యమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామపెద్ద రాజారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త నారాయణమ్మ, దివీస్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, శ్రీనివాస్, నరసింహ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్యూయలరీ ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సువశ్రీ బాగ్చీ

కొమ్మాది: బీచ్ రోడ్డు రాడిసన్ బ్లూలో శుక్రవారం వసుంధర డైమండ్ రూఫ్ ఎగ్జిబిషన్ కొనుగోలుదారులను ఆకట్టుకుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ జ్యూయలరీ ప్రదర్శనను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సతీమణి సువశ్రీ బాగ్చి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో బంగారు ఆభరణాలు, డైమండ్ జ్యూయలరీ ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వసుంధర రూఫ్ నిర్వాహకురాలు టి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉయ్యాల ఉత్సవం



అనంత పద్మనాభ స్వామిని పల్లకిలో డోలా మండపానికి ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం



అనంతుని పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చక స్వాములు, భక్తులు

పద్మనాభం: కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం అనంత పద్మనాభ స్వామి ఉయ్యాల ఉత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో పద్మనాభం జిల్లా పరిషత్ అతిథి గృహం సమీపంలోని డోలా మండపం వద్దకు వేద పండితులు వేద మంత్రోచ్చరణల నడుమ తోడ్కొని వచ్చారు. విశేష పూజల అనంతరం ఉభయ దేవేరులతో స్వామికి ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు. ఊయల ఊపడానికి భక్తులు పోటీ పడ్డారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం : కల్యాణోత్సవాల్లో భాగంగా చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలోని చక్ర పెరుమాళ్లను పల్లకీలో పద్మనాభం జంక్షన్‌కు సమీపంలోని కన్నయ్య కోనేరుగా పిలువబడే అనంత పద్మనాభ స్వామి పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు. ఇక్కడ చక్ర పెరుమాళ్లకు అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం పుష్కరిణిలో చక్ర పెరుమాళ్లకు స్నానం చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయ స్వామి సహకారంతో వేద పండితులు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భక్త బృందం సభ్యులు తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, కె.ఎర్నాయుడు, తాలాడ పైడిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వర్ణ హేల..



గంభీరం ఐఐఎంవీలో విద్యార్థుల సందడి





శివశక్తినగర్ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో ..



సంతపేటలో రంగులు జల్లుకుంటున్న చిన్నారులు



మధురవాడలో చిన్నారుల హోలీ సంబరం



పాత పీఎం పాలెంలో రంగులు పూసుకుంటున్న బాలలు



రుషికొండ బీచ్‌లో యువత కేరింత

హోలీ వేళ నియోజకవర్గమంతా రంగులమయమైంది. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా అందరూ రంగులు, నీళ్లు జల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. విద్యాసంస్థలకు సెలవులు కావడంతో చిన్నారులు, యువతీ యువకులు వీధులలో పరుగులు తీస్తూ మిత్రులపై రంగులు పులిమారు. ద్విచక్ర వాహనాలపై సందడి చేశారు. పని ప్రదేశాలలో కార్మికులు, ఉద్యోగులు ఈ హోలీని జరుపుకొన్నారు. ఇళ్ల వద్ద మహిళలు కూడా హోలీని ఆస్వాదిస్తూ సందడి చేశారు. పెద్దల నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కూడళ్లలో ఆకతాయిలు రంగులకు బదులుగా టమాటా, కోడిగుడ్లు విసురుకున్నారు. పౌర్ణమి కావడంతో భక్తులు ఆలయాలలో ప్రత్యేకపూజలు, వ్రతాలు ఆచరించారు. గంభీరం ఐఐఎంవీలో విద్యార్థులు కేరింతల నడుమ హోలీ జరుపుకొన్నారు. శిల్పారామం, శివశక్తి నగర్, మిథిలాపురి వుడా కాలనీ, కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డు, మారికవలస పరిసర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లలో ఈ సందడి ఎక్కువ కనిపించింది. రంగులు పూసుకుని సముద్రంలో స్నానాలు చేసేందుకు రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్, మంగమారిపేట బీచ్ ప్రాంతాలకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అన్ని చోట్ల పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు.

– తగరపువలస/పీఎం పాలెం/మధురవాడ/కొమ్మాది

శ్రీ మహాలక్ష్మీ నమోస్తుతే



పూజలందుకున్న మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారు



అష్టలక్ష్మి ఆలయంలో పుష్పాభిషేకానికి సిద్ధం చేసిన పువ్వులు

కొమ్మాది: సిరుల తల్లి లక్ష్మీదేవి జయంతిని స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సహస్ర దీపాల వెలుగులో అమ్మవారు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. పుష్పాభిషేకానికి చేమంతులు, గులాబీలు, మందారాలు, కలువలు తదితర పుష్పాలను తీసుకువచ్చారు. ముందుగా ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున 4 గంటలకు సుప్రభాత సేవ, 4.30 గంటలకు అష్టలక్ష్మీ హోమం ఉదయం 8 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణులకు అభిషేకాలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి సామూహిక కుంకుమార్చనలు చేశారు. 6.30 గంటలకు అమ్మవారికి సహస్ర దీపాలంకరణ సేవ, 7 గంటలకు సువర్ణ పుష్పార్చన, 7.30 గంటలకు పుష్పాభిషేకం చేశారు. పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పసుపు, కుంకుమలు సమర్పించారు.

వైభవంగా లక్ష్మి అమ్మవారి జయంతి



సహస్ర దీపాల వెలుగులో అమ్మవారు

మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో..

భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. తులసి అర్చన, సహస్ర బిల్వ దళార్చన, పంచామృతాభిషేకం, శ్రీలక్ష్మీ పొంగ్రిక యాగం, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో పల్లకిలో ఊరేగించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

27 నుంచి నూకాలమ్మ ఉత్సవాలు

నేడు చాటింపు



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వేణుబాబు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు తెలిపారు. శనివారం పండగ చాటింపు వేడుక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27 నుంచి 30 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 27న తొలేళ్ల పండగ, 28 నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. నాలుగు రోజుల పాటు పెద్దబజారు, చిన్నబజారు, ఎగువపేట ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎచ్చర్ల హరి, కోశాధికారి పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కో–ఆర్డినేటర్ గొరపల్లి సన్యాసిరావు, పెద్దలు అల్లిపిల్లి నర్సింగరావు, కదిరి ఎల్లాజి, గంటా నూకరాజు, మైలిపల్లి లక్షణరావు పాల్గొన్నారు.